ప్రజాశక్తి

ఆదివారం 19 ఫిబ్రవరి 2023 8 పేజీలు



గుంటూరు



పల్నాడు



కోటప్పకొండ కింది భాగంలో విద్యుత్ ప్రభలు

కోటప్పకొండకు పోటెత్తిన జనం

- పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి
- ఆలయాన్ని సందర్శించిన మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో కిక్కిరిసిన శైవక్షేత్రాలు





కోటప్పకొండ ఆలయంలో పట్టువస్త్రాలు తెస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్, ఎసీ, ఎస్పీ తదితరులు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి/నర్సరావుపేట

మహాశివరాత్రి సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని పలు శైవక్షేత్రాలు సందర్శకులతో కిటకిటలాడాయి. కోటప్పకొండ, అమరావతి, గోవాడ, క్వారీ, సత్రశాల, దైద తదితర శైవక్షేత్రాల్లో శనివారం తెల్లవారుజాము నుంచి అర్ధరాత్రి వరకు వరకు రద్దీ కొనసాగింది. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, తెలంగాణ జిల్లాల నుంచి కోటప్పకొండకు జనం పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. లక్షలాదిగా తరలి వచ్చిన సందర్శకులతో కోటప్పకొండ కిక్కిరిసింది. కొండ కింద భాగంలో విద్యుత్ ప్రభలు కాంతులు వెదజిమ్మడంతోపాటు వాటి వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను ఆలరించాయి. సందర్శకుల కోసం జిల్లా వ్యాప్తంగా ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు నడిపింది. 700 బస్సులను ప్రయాణికులకు అందుబాటులోకి తెచ్చింది. పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, జాయింట్ కలెక్టర్ శ్యాం ప్రసాద్, ఎస్‌పి వై.రవిశంకర్‌రెడ్డి నర్సరావుపేట ఆలయం వద్ద ఉండి ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కోటప్పకొండకు భారీ ప్రభలతో రైతులు, యాత్రికులు తరలివచ్చారు. శివరాత్రి వేడుకలను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం తరుపున ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ శనివారం రాత్రి స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. అతిథులకు ఆలయ పాలక మండలి చైర్మన్ కొండలరావు బహుదూర్, కార్యనిర్వహణ అధికారి వేమూరి గోపి స్వాగతం పలికారు. ఆలయాన్ని సందర్శించిన వారిలో మంత్రులు కొట్టుసత్యనారాయణ, అంబటి రాంబాబు, ఎంపి లావు కృష్ణదేవరాయులు, ఎమ్మెల్సీలు డొక్కా మాణిక్య వరప్రసాద్, జంగా కృష్ణమూర్తి, మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యేలు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడు, నంబూరు శంకర్రావు తదితరులున్నారు.

పెదకాకాని, క్వారీ ప్రాంతాల్లో గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, అర్బన్ ఎస్‌పి ఆరీఫ్ హఫీజ్ బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. గోవాడలో ఆలయాన్ని మంత్రి మేరుగ నాగార్జున, అమరావతిలో ఆలయాన్ని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సందర్శించారు. పెదకాకాని గంగా భ్రమరాంభ సమేత శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి ఆలయాన్ని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి దంపతులు, ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య, సత్రశాల ఆలయాన్ని ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సందర్శించారు. మహాశివరాత్రి సందర్భంగా శైవ క్షేత్రాలను, ఇతర ఆలయాలను విద్యుద్దీపాలతో సుందరంగా తీర్చిదిద్దారు. కాకానితోపాటు అమరావతి, గోవాడ, దైద, సత్రశాల, క్వారీ తదితర ప్రాంతాల్లోని శైవక్షేత్రాల్లోనూ భారీగా రద్దీ కనిపించింది.

అలా వేశారు..ఇలా తవ్వేశారు..

ముందు చూపు లేని కార్పొరేషన్ అధికార గణం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

ఇటీవల వర్షాలకు గుంటూరు లక్ష్మీపురం బస్‌బే జంక్షన్ వద్ద రోడ్డు దెబ్బతింది. రెండు మూడు నెలలు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాహనదారులు నరకం అనుభవించారు. ఎట్టకేలకు స్పందించిన కార్పొరేషన్ అధికారులు సైడ్ డ్రెయిన్లు ఏర్పాటు చేశారు. తిరిగి రోడ్డు నిర్మించారు. కొంత సిమెంట్ రోడ్డు, మిగతా తారు రోడ్డువేశారు. హమ్మయ్య రోడ్డు బాగైది.. అని ఊపిరి పీల్చుకోనే లోగా మళ్లీ తాగునీటి పైపు లైను మరమ్మతుల పేరుతో రోడ్డును పూర్తిగా తవ్వేశారు. ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. పైపులైను మరమ్మతులు చేసే ఆలోచన ఉందని తెలిసినా అప్పట్లో పట్టించుకోకుండా రోడ్డు వేశారు. తిరిగి ఇప్పుడు పైపు లైన్ల మరమ్మతులకు తవ్వకాలు చేపట్టడం వల్ల మళ్లీరోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. ముందు చూపు లేకపోవడం వల్ల రూ.లక్షల్లో కార్పొరేషన్‌కు ఖజానకు నష్టం, ప్రయాణాలకు కష్టం.. వచ్చి పడింది.

లక్ష్మీపురం నుంచి సంజీవయ్యనగర్ రైలు గేటు దాకా చేపట్టిన నూతన పైపులైన్ వినియోగంలోకి తీసుకువచ్చేందుకు ఈ పనులను చేపట్టారు. ఈ పనులు పూర్తి చేసి పశ్చిమ నియోజకవర్గం పరిధిలో కలుషిత నీరు రాకుండా చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు. ఈ పనులు దాదాపు ఏడాది క్రితమే చేపట్టాల్సి ఉండగా తీవ్ర జాప్యమైంది. తాజాగా మేయర్, కమిషనర్ జోక్యంతో ప్రారంభించారు. ఇంజినీరింగ్ విభాగం అధికారులకు ముందు చూపులేకపోవడం వల్ల కార్పొరేషన్‌కు అదనపు ఖర్చు, రాకపోకలకు మళ్లీ ఇబ్బందులు ఏర్పడ్డాయి.





అనారోగ్యానికి గురైన సినీ నటుడు నందమూరి తారకరత్న శనివారం రాత్రి మృతి చెందారు. తారకరత్న గత డిసెంబర్ 18న గుంటూరు జిల్లాలోని పెదనందిపాడు మండలం పాలపర్రుకు వచ్చారు. టిడిపి అభిమానులు ఏర్పాటు చేసిన ఎన్‌టిఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. తాతయ్య స్ఫూర్తితో త్వరలో రాజకీయ రంగ ప్రవేశమూ చేయబోతున్నట్లు ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు.

రెండేళ్లుగా అదే తీరు... 8పే

నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ ఈసారైనా పూర్తయ్యేనా? 7పే



కలెక్టర్‌ను సత్కరిస్తున్న సహాయక కార్యదర్శి శ్రీనివాసరెడ్డి

దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో కలెక్టర్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి-తెనాలి

మహాశివరాత్రి పర్వదినోత్సవాన్ని పురస్కరించుకుని పెదకాకాని గంగా భ్రమరాంభ సమేత శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన పూజల్లో గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి దంపతులు, ఎమ్మెల్యే కిలారి



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కిలారి రోశయ్య

వేంకటరోశయ్య పాల్గొన్నారు. ఆలయ సహాయక కమిషనర్ శ్రీనివాసరెడ్డి వారిని ఆలయ మర్యాదలతో స్వాగతించారు. ప్రత్యేకంగా వారిని సత్కరించి, జ్ఞాపికలను అందించారు. ఆలయంలో తెల్లవారుజాము నుంచే భక్తుల తాకిడి ప్రారంభమైంది. భక్తుల కోసం ఏర్పాటు చేసిన లైన్లలో వారు క్యూకట్టారు. వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాటు చేవారు. వాహనాల రాకపోకలకు, పార్కింగ్‌కు, భక్తులు పొంగళ్లు పెట్టుకునేందుకు పూర్తి సౌకర్యాలను కల్పించారు. భక్తుల తాకిడితో ఆలయం ప్రత్యేక శోభను సంతరించుకుంది.



దుర్గగుడిలో అలరించిన నృత్య ప్రదర్శనలు

ప్రజాశక్తి-వన్‌టౌన్: శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ఆధ్వర్యంలో ధర్మపథంలో భాగంగా దుర్గగుడి వేదికపై శనివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను అలరించాయి. దేవాదాయ ధర్మాదాయ శాఖ నేతృతంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం శ్రీ కనకదుర్గా నృత్యమందిర్ నిర్వాహకులు వైఎస్‌విఎన్ అనూరాధ తన కళా బృందంతో కూచిపూడి నృత్య ప్రదర్శనలు, భరత నాట్యం, ఆంధ్ర నృత్యంతో అలరించారు. 'వినాయక కౌత్వం', 'సాయి వివాయనవే', 'సంగీత సామ్రాజ్య', 'పలుకే బంగారమాయె', 'ముద్దుగారె', 'శివలీలలు' వంటి కీర్తనలకు పలువురు చిన్నారులు తమ ప్రతిభను కనబర్చి అలరించారు. శ్రీ కనకదుర్గా నృత్యమందిర్‌కి చెందిన ఎంఎన్‌ఎస్ భార్గవి, జె.కనిష్క, బి.నయోనిక, జి.జ్ఞాన సమన్విత, డి.ఉన్మేష, కె.కావ్య, కె.దేవి, డి.హవిష్మశ్రీ, పి.తన్మయి, ఎస్.రిజుత, ఎం.భావన, ఎన్.రిషిత, ఎం.ప్రణీతలు దుర్గగుడి వేదికపై తమ నృత్య ప్రదర్శనలతో పలువురిని ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమాలను ఆలయ ఇఓ భ్రమరాంబ పర్యవేక్షించారు.



ఏర్పాట్ల గురించి భక్తులను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ శివశంకర్

పల్నాడు జిల్లా కలెక్టర్ సహా త్రికోటేశ్వర స్వామిని దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి - నరసరావుపేట

పల్నాడు జిల్లాలో ప్రఖ్యాత శైవక్షేత్రమైన కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి వారిని పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ లు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. శనివారం ఉదయం సాధారణ భక్తుల తరహాలో కుటుంబ సమేతంగా ఆర్టీసీ బస్సులో కొండ దిగువ నుండి కొండపైకి ప్రయాణం చేశారు. స్వామి దర్శనం కోసం వేచి ఉన్న భక్తులతో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. వేడుకలను పురస్కరించు కొని భక్తులకు అందుతున్న సేవలను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని దేవాదాయశాఖ, పోలీసు సంబంధిత శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఆలయ ప్రధాన అర్చకులు, ఆలయ నిర్వాహకులు స్వామి వారి శేష వస్త్రాలతో జిల్లా కలెక్టర్ దంపతులను సత్కరించారు. అనంతరం కొండ దిగువనున్న పలు స్టాళ్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, నరసరావుపేట తాహశీల్దార్లు రమణా నాయక్, బందెల కిరణ్ తదితరులు ఉన్నారు.

మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామినీ దర్శించుకునేందుకు ప్రముఖులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులతో పాటు పలువురు ప్రముఖులు కుటుంబ సభ్యులతో వచ్చి స్వామివారిని దర్శించు కున్నారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్సీలు జంగా కృష్ణమూర్తి, డొక్కా మాణిక్య వరప్రసాద్, మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యేలు బొల్లా బ్రహ్మనాయుడు, పిన్నెల్లి రామకష్ణారెడ్డి, నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకష్ణ దేవరాయలు, పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్ రెడ్డి, పలువురు జిల్లా న్యాయమూర్తులు, మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు, బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్, ఒంగోలు ఎస్పీ మల్లిక ఖర్గ్, పలు కార్పొరేషన్ల చైర్మన్లు, ప్రజా ప్రతినిధులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అతిథులకు ఆలయ ఈవో వేమూరి గోపి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, పూజల అనంతరం స్వామి ప్రసాదం శేష వస్త్రాలతో సత్కరించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా, పలువురు ప్రముఖులు స్వామివారిని దర్శించుకునేలా పల్నాడు జిల్లా యంత్రాంగం దేవాదాయ శాఖ, పోలీస్ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు సహాయ సహకారాలు అందిస్తున్నాయి. భక్తులకు తాగునీరు, క్యూ లైన్ ల ద్వారా స్వామి వారి దర్శనం వేగవంతంగా జరగడంతో పాటు, ఉచిత భోజనం, మజ్జిగ పంపిణీ కార్యక్రమాలను నిరంతరం కొనసాగించారు.



స్టాల్స్‌ను తిలకిస్తున్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్

ఛాయాచిత్ర ప్రదర్శనను ప్రారంభించిన అధికారులు

ప్రజాశక్తి-నరసరావుపేట

మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించు కొని కోటప్ప కొండ క్రింద సమాచార పౌర సంబంధాల శాఖ సందర్శనీయ స్థలాలు స్థలాలు, అభివృద్ధి సంక్షేమ పథకాలపై ఏర్పాటుచేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను జిల్లా కలెక్టర్ శివశంకర్, జాయింట్ కలెక్టర్ సంయుక్తంగా ప్రారంభించి తిలకించారు. డి ఆర్ డి ఏ, మెప్మా, వ్యవసాయ అనుబంధ శాఖలు మరియు వివిధ శాఖలు చేసిన స్టాల్ లను జిల్లా కలెక్టర్ మరియు జాయింట్ కలెక్టర్లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి బాలు నాయక్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కుటుంబ సభ్యులతో కొండపైకి వెలుతున్న జిల్లా కలెక్టర్



బస్సులో కొండపైకి వెలుతున్న జిల్లా అధికారులు



మంత్రి కొట్టు సత్యనారాయణతో ఎమ్మెల్యే దంపతులు, ఆలయ ధర్మకర్త రాజా మల్రాజు బహదూర్



ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయల దంపతులు



మంత్రి అంబటి,ఎమ్మెల్సీ డొక్కా లతో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

'చలో ఢిల్లీ' జయప్రదం కోసం నేడు సమావేశం

ప్రజాశక్తి - పెదనందిపాడు: రైతుల, కార్మికుల, ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఏప్రిల్ 5న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం సాయంత్రం 3.30 గంటలకు స్థానిక గీతా మందిరంలో సమావేశం నిర్వహిస్తున్నారు. ఈ మేరకు సిఐటియు మండల కార్యదర్శి మద్దూరి సరిత, రైతు సంఘం మండల అధ్యక్షులు ముద్దన వెంకటేశ్వర్లు, కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి కొత్త శివనాగేశ్వరరావు, వ్యవ సాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మద్దూరి రమణ ఒక ప్రకటనలో తెలిపారు .

నేడు ఎస్ఐ ప్రిలిమ్స్ పరీక్ష

ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్ : ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డ్ ఎస్ఐ ప్రిలిమ్స్ పరీక్ష ఆదివారం కృష్ణాజిల్లాలోని 11 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పి పి.జాషువా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష నిర్వహణకు పటిష్ట భద్రతా చర్యలు తీసుకున్నామని, పరీక్షా కేంద్రాల చుట్టుపక్కల సెక్షన్ 144 సిఆర్పిసి 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. మొత్తం 5502 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. పరీక్షా సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైనా లోనికి అనుమతించేదిలేదని తెలిపారు. ఉదయం 10 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు, మధ్యాహ్నం 2.30 నుండి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించే ఈ పరీక్షకు అభ్యర్థులంతా 9 గంటలకే పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకోవాలని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, స్టాప్‌వాచ్లను అనుమతించబోమని తెలిపారు. అభ్యర్థులు తమ వెంట హాల్ టికెట్, బ్లూ, బ్లాక్ పెన్‌లు, ఒరిజినల్ గుర్తింపు కార్డు తెచ్చుకోవాలని పేర్కొన్నారు.

గందరగోళం వద్దు

కానూరు, గన్నవరం పరిధిలో పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు పరీక్షా కేంద్రాలను ముందుగానే పరిశీలించు కోవాలని ఎస్పి సూచించారు. సిద్ధార్థ ఇనిస్టిట్యూట్స్ పేరుతో 7 కేంద్రాలు ఉన్న విషయాన్ని గమనంలో ఉంచుకోవాలని పేర్కొన్నారు. ముందుగానే కేంద్రాలను సందర్శించడం వల్ల ఆలస్యాన్ని అధిగమించవచ్చని సూచించారు.

దళారులను నమ్మొద్దు

పరీక్ష రాయకుండా డబ్బులిస్తే ఉద్యోగం వస్తుందన్న దళారుల మాటలను నమ్మి మోసపోవద్దని ఎస్పి హెచ్చరించారు. పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి మాత్రమే ఉద్యోగం లభిస్తుందని స్పష్టంచేశారు. మహిళా అభ్యర్థుల సౌకర్యార్థం మహిళా సిబ్బందిని నియమి స్తున్నట్లు తెలిపారు.

త్వరలో తూర్పు బైపాస్‌కు శ్రీకారం


- డిపిఆర్ టెండర్లు దక్కించుకున్న 'చైతన్య'
- 49.8 కిలో మీటర్ల నిర్మాణానికి ప్రతిపాదనలు
- కృష్ణానదిపై 3.7 కిలో మీటర్ల వంతెన
- రూ.4,608 కోట్లు ఖర్చవుతుందని అంచనా

ప్రజాశక్తి - గన్నవరం

విజయవాడ తూర్పు బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు అతి త్వరలో పట్టాలెక్కబోతున్నాయి. తూర్పు బైపాస్ రోడ్డు నిర్మాణానికి జాతీయ రహదారుల సంస్థ డిపిఆర్ రూపకల్పన నిమిత్తం టెండర్లు ఆహ్వానించగా, చైతన్య కన్సల్టెన్సీ టెండర్లు దక్కించుకుంది. డిపిఆర్ రూపకల్పన కూడా దాదాపు సిద్ధమైనట్లు తెలిసింది. కృష్ణాజిల్లా పొట్టిపాడు నుంచి గుంటూరు జిల్లా కాజ వరకు మొత్తం 49.3 కిలోమీటర్ల మేర బైపాస్ రోడ్డు నిర్మించేలా ప్రతిపాదనలు రూపొందించారు. దీనిలో భాగంగా కృష్ణానదిపై 3.7 కిలోమీటర్ల మేర వంతెన నిర్మించనున్నారు. మొత్తంగా ఈ ప్రాజెక్టుకు రూ.4,608 కోట్ల మేర వ్యయమవుతుందని అంచనా. విజయవాడకు పశ్చిమవైపు చిన్న అవుటపల్లి నుంచి గొల్లపూడి మీదుగా కాజ వరకు ఇప్పటికే బైపాస్ నిర్మాణం వేగంగా జరుగుతోంది. తూర్పువైపు కూడా బైపాస్ కావాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. దీనికి సమ్మతించిన కేంద్రం జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ద్వారా ఎలైన్‌మెంటు ఖరారు, డిపిఆర్ సిద్ధం చేయిస్తోంది. ముందుగా తూర్పు బైపాస్ 40 కిలోమీటర్లు మేర ఉంటుందని భావించగా.. ఆ తర్వాత నాలుగు మార్గాలను పరిశీలించారు. దీనిలో 49.3 కిలోమీటర్లు ఎలైన్‌మెంటుకు నేషనల్ హైవేస్ (ఎన్‌హెచ్) ఆమోదం తెలిపే అవకాశం ఉందని తెలిసింది. దాదాపు ఖరారైన ఎలైన్‌మెంటు ప్రకారం...కృష్ణాజిల్లా పరిధిలో 29.5 కిలోమీటర్లు, గుంటూరు జిల్లా పరిధిలో 19.7 కిలోమీటర్లు మేర రోడ్డు నిర్మాణం ఉంటుంది. నాలుగు వరుసలుగా దీనిని నిర్మించనుండగా, భవిష్యత్తులో ఆరు వరుసల విస్తరణకు వీలుగా 60 మీటర్ల వెడల్పుతో ఎలైన్‌మెంటు ఖరారు చేస్తున్నారు. మొత్తం 295 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంటుందని అంచనా. మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.4,608 కోట్లుగా అంచనా వేశారు. నిర్మాణ వ్యయం రూ.2,215.48 కోట్లుగా ఉంటుందని అంచనా. కృష్ణానదిపై వంతెనతోపాటు 22 ప్రధాన వంతెనలు, 2 ఆర్‌ఒబిలు,

త్వరలో తూర్పు బైపాస్‌కు శ్రీకారం

ఒక ఫ్లైఓవర్, 2 ఇంటర్ ఛేంజ్‌లు నిర్మించేలా ప్రతిపాదిస్తున్నారు. ఈ రహదారి కృష్ణాజిల్లాలో ఉంగుటూరు, గన్నవరం, కంకిపాడు, తోట్లవల్లూరు, పెనమలూరు, ఉయ్యూరు మండలాల్లోని ఆత్కూరు, పెదఅవుటపల్లి, అల్లాపురం, బూతిమిల్లిపాడు, తెన్నేరు, తరిగొప్పుల, మారేడుమాక, కోమటిగుంట, మానికొండ, కోలవెన్ను, దావులూరు, నెప్పల్లి, చలివేంద్రపాలెం, బొడ్డపాడు, రొయ్యూరు గ్రామాల మీదుగా వెళ్లనుంది. అక్కడి నుంచి కృష్ణానది వంతెన దాటిన తర్వాత గుంటూరు జిల్లాలోని కొల్లిపర, దుగ్గిరాల, మంగళగిరి, తాడేపల్లి మండలాల్లోని వల్లభాపురం, పేరకలపూడి, చుక్కపల్లివారిపాలెం, మోరంపూడి, చిలువూరు, తుమ్మపూడి, చినకాకాని, కాజ గ్రామాల మీదగా ఎన్‌హెచ్-16లో కలుస్తుంది. తరిగొప్పుల, మోరంపూడిల వద్ద రైల్వేలైన్లు, దావులూరు వద్ద మచిలీపట్నం-విజయవాడ జాతీయ రహదారి మీదగా తూర్పుబైపాస్ వెళ్లేలా ఎలైన్‌మెంటు రూపొందించారు.





21న అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 21వ తేదీ అంతర్జాతీయ మాతృబాషా దినోత్సవం స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం, అన్నమయ్య కళావేదికపై సాయంత్రం 6 గంటలకు సభ నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు సోమేపల్లి వెంకటసుబ్బయ్య ఎస్.ఎం.సుభాని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డాక్టర్ మైలవరపు లలిత కుమారి అధ్యక్షతన జరిగే సభలో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ పాల్గొంటారని, సాహితీ విమర్శకులు డాక్టర్ పి.వి.సుబ్బారావు, పద్య కవి ఈవూరి వెంకటరెడ్డికి ఆత్మీయ సత్కారం జరుగుతుందన్నారు. తెలుగు బాషాభిమానులు, సాహితీ వేత్తలు, కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కండరాల సమస్యలపై నేడు ఆరోగ్యసభ

ప్రజాశక్తి-గుంటూరు

అవగాహన సంస్థ ఆధ్వర్యంలో నేడు అరండల్‌పేట 15/1లోని సంస్థ కార్యాలయంలో కండరాలు, నరాల సంబంధిత వ్యాధులపై ఉదయం 11గంటలకు ఆరోగ్యసభ నిర్వహిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆరోగ్య సభలో ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ సిహెచ్.పవన్‌కుమార్ ప్రదానవక్తగా పాల్గొంటారని, జనరల్ ఫిజీషియన్, న్యూరాలజిస్ట్ డాక్టర్ పవన్‌కుమార్ ఫిట్స్, పక్షవాతం, కళ్లు తిరగటం, వణుకుడు జబ్బు, మతిమరుపు, బిపి, షుగర్ తదితర ఆరోగ్య సమస్యలపై సందేహాలను నివృత్తి చేస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



కొనసాగుతున్న సెల్‌ఫోన్ల అప్పగింత

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వారికి తిరిగి అప్పగించే ప్రక్రియ కొనసాగుతుందని జిల్లా ఎస్పి ఆరీఫ్ హఫీజ్ తెలిపారు. జిల్లాలోని వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఆరుగురు వ్యక్తులకు వారి ఫోన్లను అప్పగించారు. సెల్ ఫోన్ పోగొట్టుకున్న బాధితుల కొరకు ఏర్పాటు చేసిన వాట్సప్ నెంబర్ 8688831574 సెల్ ఫోన్ పోగొట్టుకున్న బాధితులు వాట్సప్ నెంబర్ ఉపయెగించుకొవాలని కోరారు.

తిరునాళ్లకు వెళ్తుండగా ఒరిగిన ప్రభ

ప్రజాశక్తి - చేబ్రోలు



తిరునాళ్లకు తీసుకెళు న్న ప్రభ ఒక్కసారిగా కూలిపోయింది. మహాశివరాత్రి సందర్భంగా క్వారీ తిరునాళ్లకు మండంలోని నారాకోడూరుకు చెందిన మిత్రమండలి బృందం ప్రభను ఏర్పాటు చేసింది. ప్రభతో స్థానికులు రాత్రి వేళ తిరునాళ్ల వద్దకు బయలుదేరారారు. 11.30 గంటలు దాటిన తర్వాత శివాలయం వద్ద నుండి ప్రధాన రహదారిలోకి వచ్చే క్రమంలో మూలమలుపు నుండి మెయిన్ రోడ్డుపైకి తిప్పుతుండగా ఒక్కసారిగా ప్రభ పక్కకు వాలిపోయింది. విద్యుత్ స్తంభం మీద పడి అనంతరం పక్కనే ఉన్న దుకాణాలపై పడింది. ఈ క్రమంలో యువకునికి కాలు విరగగా పలువురికి స్వల్ప గాయాలయ్యాయి.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ప్రజాశక్తి - రెంటచింతల : శివరాత్రి సందర్భంగా జాగారం చేసేందుకు మండలంలోని సత్రశాలకు శనివారం రాత్రి వెళు న్న ట్రాక్టర్ వెనుక డోర్ ఊడిపోవడంతో దానిలో ప్రయాణిస్తున్న యాత్రికులు కిందపడిపోయారు. క్షత గాత్రులను మాచర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో చికిత్స పొందుతూ, పరిస్థితి విషమించి తుమ్మరకోట గ్రామానికి చెందిన కారంపూడి నన్నేసాహెబ్ 61 కారంపూడి లాల్ సాహెబ్ 38 మృతి చెందారు. మరోనలుగురికి చికిత్స అందజేస్తున్నారు. మృతి చెందిన వారిలో నన్నేసాహెబు తుమ్మరకోట గ్రామ వైయస్సార్సీపీ నాయకులు మరియు మాజీ ఉప సర్పంచ్‌గా పనిచేశారు.



ఆటో బోల్తా - ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - మాచర్ల : మాచర్ల నుండి జమ్మలమడక వైపు వెళుతున్న ఆటో బోల్తా పడటంతో ఇరువురు యువకు లకు తీవ్ర గాయాలు అయినాయి. జమ్మలమడక గ్రామానికి చెందిన మక్కెన వెంకటేష్‌కు తలకు బలమైన గాయం కావటంతో మాచర్ల ప్రభుత్వ వైద్యశాలలో ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం నర్సరావుపేట తరలించారు. మరో యువకుడు నాగేళ్ళ తిరుమల వాసుకు స్వల్ప గాయాలు అయినాయి. మాచర్ల ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పోందుతున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేచర్ ఇండెక్స్‌లో ఎపి ఎస్ఆర్ఎం ప్రతిభ

దేశంలోని ప్రవేటు వర్సిటీల్లో 3వ స్థానం

ప్రతిష్టాత్మక నేచర్ ఇండెక్స్‌లో 45వ ర్యాంక్

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి అంతర్జాతీయ స్థాయిలో పేరున్న నేచర్ ఇండెక్స్ ర్యాంకింగ్‌లో 45వ స్థానం లభించింది. ఇండియాలో పేరున్న పలు విశ్వవిద్యాలయాలు, ఐఐటీలు, ఎన్ఎస్ఐటీలు, జాతీయ పరిశోధనా సంస్థల నుంచి ప్రఖ్యాత జర్నల్స్‌లో ప్రచురితమైన పరిశోధనా పత్రాలను పరిగణనలోకి తీసుకుని నేచర్ ఇండెక్స్ తాజాగా ర్యాంకులను ప్రకటించింది. ఏపీ ఎస్ఆర్ఎం ఫిజిక్స్ ప్రొఫెసర్ రంజిత్ థాపా, డాక్టర్ అమిత్ చక్రవర్తి, డాక్టర్ షోజి, కెమిస్ట్రీ ప్రొఫెసర్ డాక్టర్ మహేశ్ రవ్వా, డాక్టర్ నిమై మిశ్రా, డాక్టర్ పంకజ్ భల్లా లకు చెందిన 11 పరిశోధనా పత్రాలు ప్రపంచ ప్రాముఖ్యత సంతరించుకున్న జర్నల్స్ ప్రచురితం అయ్యాయి. ఈ పరిశోధనా పత్రాలన్నీ లైఫ్ సైన్స్, ఫిజికల్ సైన్స్, కెమికల్, ఎర్త్ సైన్స్లకు సంబంధించినవి మొత్తం 82 జర్నల్సు క్రోడీకరించి అందులో విశిష్టమైన పరిశోధనా పత్రాలను ఎంపిక చేశారు. అమెరికా కేంద్రంగా వివిధ యూనివర్సిటీల పరిశోధనలు ప్రొఫెసర్ల పరిశోధనా పత్రాలు, వాటిలోని సైంటిఫిక్ విలువలను గుర్తించి ఏటా నేచర్ ఇండెక్స్ ర్యాంకులను కేటాయిస్తుంది. పలు దేశాల్లోని వివిధ యూనివర్సిటీలు, పరిశోధనా సంస్థలు ఈ ర్యాంకులను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటాయి. ఈ నేపథ్యంలో ఈ సారి ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి ఇండియాలోని ప్రవేటు వర్సిటీల్లో 3వ స్థానం లభించడం విశేషం. ఇండియాలోని గుర్తింపు కలిగిన పలు యూనివర్సిటీలు, ఐఐటీలకు సైతం లభించని ఉత్తమ ర్యాంక్లు ఏపీ ఎస్ఆర్ఎంకు లభించడం అభినందనీయమని యూనివర్సిటీ ప్రొఫెసర్ - వైస్ ఛాన్సలర్ ఆచార్య డి నారాయణరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పరిశోధనా పత్రాలను పంపిన ప్రొఫెసర్లు, రీసెర్చ్ స్కాలర్లకు ఏపీ ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం ప్రెసిడెంట్ డాక్టర్ సత్యనారాయణన్, వైస్ చాన్సలర్ ఆచార్య మనోజకుమార్ అరోరాలు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఇది ఏపీ ఎస్ఆర్ఎంకు దక్కిన అరుదైన గౌరవమని అభిప్రాయపడ్డారు. రానున్న రోజుల్లో ఏపీ ఎస్ఆర్ఎం వర్సిటీ మొదటి స్థానంలో ఉండేలా కృషి చేయాలని ప్రెసిడెంట్ డాక్టర్ సత్యనారాయణన్ కోరారు.



ఆస్పత్రిలో అనంత పిచ్చయ్యను పరామర్శిస్తున్న వి.శ్రీనివాసరావు

సిపిఎం సీనియర్ నాయకులు అనంత పిచ్చయ్యకు వి.శ్రీనివాసరావు పరామర్శ

ప్రనజాశక్తి - నరసరావుపేట

సిపిఎం సీనియర్ నాయకులు, సత్తెనపల్లి పట్టణ మాజీ కార్యదర్శి అనంత పిచ్చయ్యను ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శనివారం పరామర్శించారు. కొద్దిరోజుల కిందట అనారోగ్యానికి గురైన పిచ్చయ్య నరసరావుపేటలోని మహాత్మా గాంధీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఆయన్ను పరామర్శించిన వి.శ్రీనివాసరావు అనతరం పిచ్చయ్య కుటుంబీకులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్, కార్యదర్శివర్గ సభ్యులు వై.రాధాకృష్ణ, వై.గోపాలరావు ఉన్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం

రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి రజిని

సిఎం జగన్‌పై చంద్రబాబు, లోకేశ్ విమర్శలకు ఖండన

ప్రజాశక్తి - చిలకలూరిపేట



సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రతిపక్ష నేత చంద్రబాబు ఇష్టానుసారం మాట్లాడ్డం సరికాదని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి విడదల రజిని అన్నారు. ఈ మేరకు స్థానిక పురుషోత్తపట్నంలోని తన నివాసంలో శనివారం విలేకర్లతో మాట్లాడారు. చంద్రబాబు మతిస్థిమితం లేకుండా రాష్ట్రమంతటా తిరుగుతున్నారని, సిఎంను దుర్భాషలాడుతూ అనవసరంగా ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. లోకేశ్ తన పాదయాత్రకు జనం లేకు విలవిల్లాడుతున్నారని, అయినా బింకంగా పాదయాత్ర చేస్తున్నారని ఎద్దేవ చేశారు. లోకేశ్ చేస్తున్న ఆరోపణలు వేటికీ ఆధారాల్లేవన్నారు. సాక్షి పత్రిక, ఛానల్ దేశంలోనే సర్క్యులేషన్ పరంగా తొలి స్థానంలో ఉన్నాయంటే అందుకు కారణం వైఎస్ భారతి అని, అయితే ఆమెను కావాలనే వివాదాల్లోకి లాగుతున్నారని విమర్శించారు. భారతిని ఏమైనా అంటే సహంచబోమని హెచ్చరించారు. హెరిటేజ్ వ్యాపారంలో అవినీతి ఎంతో ప్రజలందరికీ తెలుసన్నారు.

అరాచక పాలన పోవాలి : పుల్లారావు

ప్రజాశక్తి - చిలకలూరిపేట



రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి అరాచక పాలన పోవాలని, ప్రజలంతా సంతోషంగా ఉండాలని తాను త్రికోటేశ్వరసామిని కోరుతున్నట్లు మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు అన్నారు. ఈ మేరకు శనివారం తన నివాసంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. చంద్రబాబు, లోకేశ్ యాత్రలను అడ్డుకోవాలని చూడడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, ఎన్నికలు ఎప్పుడు పెట్టినా వైసిపి ఓడిపోవడం ఖాయమని అన్నారు. దీన్ని సహించలేకే చంద్రబాబు, లోకేశ్ యాత్రలకు రాష్ట్ర ప్రభుత్వం అవాంతరాలు కలిగిస్తోందని ఆరోపించారు.

సందర్శకుల సేవలో స్వచ్ఛంద సంస్థలు



అన్నదానం చేస్తున్న మంత్రి రజిని తదితరులు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండ సందర్శకులకు శనివారం స్థానిక అడ్డరోడ్డు సెంటర్లో మల్లెల సత్యనారాయణ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అల్పాహారా శిబిరాన్ని ఏర్పాటు చేయగా రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి విడుదల రజని ప్రారంభించారు. శిబిరాన్ని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మల్లెల రాజేష్ నాయుడు ఏర్పాటు చేయగా వైసిపి నాయకులు, విడదల గోపీనాథ్ పాల్గొన్నారు. జ్ఞానేశ్వర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక కళ్యాణి సెంటర్లో అడ్డరోడ్డు వద్ద శనివారం అన్నదాన శిబిరం ఏర్పాటు చేయగా సంస్థ చైర్మన్ షేక్ జాన్‌సైదా ప్రారంభించారు. 15వ వార్డు కౌన్సిలర్ జాలాది సుబ్బారావు, సిహెచ్.యజ్ఞేశ్వరరెడ్డి, ఎంవి రత్నారెడ్డి, కరిముల్లా, జి.శ్రీనివాసరెడ్డి, కె.విజయ భాస్కరరెడ్డి, వైఎస్ కరిముల్లా, ఎం.శేషిరెడ్డి పాల్గొన్నారు.



ప్రజాశక్తి - నరసరావుపేట : విశ్వజనని ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు, చైర్మన్ బొగ్గారపు బ్రహ్మానందం చెప్పారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో శివుని బొమ్మ సెంటర్‌లో కోటప్పకొండ సందర్శకులకు అల్పాహారం, మజ్జిగ, తాగునీరు పంపిణీ చేశారు. శిబిరాన్ని పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్, ఎన్ఇసి కళాశాలల కరస్పాండెంట్ మిట్టపల్లి రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రమేష్‌ను బ్రహ్మానందం సత్కరించారు. అల్పాహార పంపిణీ కార్యక్రమం ఆదివారం తిరునాళ్ల హడావుడి ముగిసే వరకు కొనసాగుతుందని బ్రహ్మానందం చెప్పారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ జి.సీతారామాం జనేయులు, కార్యదర్శి పి.జ్యోతి, ట్రెజరర్ ఎం.అనితారెడ్డి, ఈసీ మెంబర్ పి.సుబ్రహ్మణ్యశాస్త్రి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి - వినుకొండ : శైవక్షేత్రాల సందర్శకులకు బొల్లా వెంకట కోటయ్య, సత్యవతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పులిహోర, తాగునీటిని పంపిణీ చేశారు. ఫౌండేషన్ అధ్యక్షులు బొల్లా రమేష్‌బాబు, బొల్లా శ్రీనివాసరావు, ఎం.చంద్రం, ప్రేమ్‌నాథ్ ప్రకాష్, శివాయాదవ్, పప్పిరెడ్డి, బ్రహ్మం, వినోద్, శ్రీను పాల్గొన్నారు.

ప్రజాశక్తి - రెంటచింతల : మండలంలోని ప్రాచీన శైవక్షేత్రం సత్రశాల వద్ద వేడుకలు ఘనంగా నిర్వహించారు. సందర్శకులు వేకువజామునే సత్రశాలకు చేరుకొని కృష్ణానదిలో స్నానం చేసి ఆలయాన్ని సందర్శించారు. ఆలయ ప్రాంగణంలో మంచికల్లు చౌడేశ్వరి కోలాటం సమాజం నిర్వహించిన మహిళల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. పరాశక్తి సిమెంట్స్ ఆధ్వర్యంలో ప్రసాదం పంపిణీ చేశారు. జాగరణ చేసేవారి కోసం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు వసతి, భోజన సదుపాయాలు ఏర్పాటు చేశారు. ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి ఆలయ ధర్మకర్తల మండలి స్వాగతం పలికింది. సందర్శకుల్లో వైపిపి నాయకులు పిన్నెల్లి వెంకటరామిరెడ్డి, మోర్తల ఉమా, ఎంపిపి చౌడేశ్వరి ఉన్నారు.



ప్రజాశక్తి - మాచర్ల, విజయపురిసౌత్ : పట్టణం, మండల పరిధిలోని శైవక్షేత్రాలు సందర్శకులతో కిటకిటలాడాయి. అన్ని ఆలయాల్లో అన్నదానం చేశారు. ప్రధాన శైవక్షేత్రాల్లో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. పట్టణంలో శ్రీ రామప్ప దేవాలయం, నగరేశ్వరదేవాలయం, తేరాల సిద్ధేశ్వర స్వామి ఆలయం, ఉప్పలపాడు బుగ్గమల్లయ స్వామి ఆలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఏలేశ్వరస్వామి ఆలయానికి శనివారం అనుపు నుంచి పర్యాటక లాంచీల్లో సందర్శకులు భారీగా తరలివెళ్లారు. వీరికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. మాచర్ల రూరల్ సిఐ షేక్ సమీవుల్లా, ఎస్ఐ పి.అనిల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. సందర్శకుల తాకిడితో ఏపీ పర్యాటక శాఖకు రూ.3.12 లక్షల ఆదాయం సమకూరింది.

ప్రజాశక్తి - యడ్లపాడు : మండల కేంద్రమైన యడ్లపాడు, లింగారావుపాలెం, జగ్గాపురం, జాలాది, ఉన్నవ, చెంఘీజ్‌ఖాన్‌పేట, కొండవీడు, కొత్తపాలెం, మైదవోలు, తిమ్మాపురం, తుర్లపాడు, దింతెనపాడు, కారుచోల, సందెపూడి గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. సందర్శకులు భారీగా తరలివచ్చారు.

ప్రజాశక్తి - అమరావతి : రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుండి సందర్శకులు మండల కేంద్రమైన అమరావతిలోని శ్రీఅమరలింగేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించారు. వీరికోసం ఆలయ అధికారులు ప్రత్యేకంగా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఆలయాన్ని ఎమ్మెల్యే నంబూరు శంకర రావు సందర్శించారు. వట్టికుంట చారిటబుల్ ట్రస్టు, శ్రీ అమరలింగేశ్వర కాపు సేవసంఘం ఆధ్వర్యంలో సందర్శకులకు అన్నదానం చేశారు. పలు స్వచ్ఛంద సేవా సంస్థలు మజ్జిగ, తాగునీరు, పులిహోర అందించాయి.



ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ : అచ్చంపేట రోడ్డులో శివాలయాలనికి సందర్శకులు భారీగా తరలిరాగా 6 వేల మందికి శివసేన సమాజం ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. వాసవి క్లబ్ శ్రీనివాస్ డైమండ్ ఆధ్వర్యంలో 4 వేల మందికి పులిహోర పంపిణీ చేశారు. కోటప్పకొండకు వెళ్లేవారికి ఐదులాంతర్ల సెంటర్‌లో పులిహోర పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు ఐ.నాగవెంకట కోటేశ్వరరావు, కార్యదర్శి వి.నాగేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి ఎ.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



పల్నాడు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో తాగునీరు పంపిణీ

ప్రజాశక్తి - నరసరావుపేట

కోటప్పకొండ తిరునాళ్ల సందర్భంగా స్థానిక కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సందర్శకులకు తాగునీరు సరఫరా చేశారు. విజ్ఞాన కేంద్రం కన్వీనర్ షేక్ మస్తాన్‌వలి, సిపిఎం నాయకులు కామినేని రామారావు, జిలాని మాలిక్ పాల్గొని నీరు అందించారు.

టిడిపి శ్రేణులపై వైసిపి దాడి

ప్రజాశక్తి - నరసరావుపేట



దాడిలో గాయపడిన టిడిపికి చెందిన వారు

కోటప్పకొండ తిరునాళ్ల సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రభల విషయంలో టిడిపికి చెందిన వారిపై వైసిపికి చెందిన వారు దాడి చేయడంతో పలువురు గాయపడ్డారు. మండలంలోని కేసానుపల్లిలో శనివారం చోటుచేసుకున్న ఘటనపై క్షతగాత్రుల వివరాల ప్రకారం.. గ్రామంలో వైసిపికి చెందిన వారు, టిడిపికి చెందిన వారు వేర్వేరుగా ప్రభలు ఏర్పాటు చేసుకున్నారు. సాయంత్రం 3.30 గంటలు దాటిన తర్వాత ప్రభలు కొండకు బయలుదేరాయి. అయితే వైసిపికి చెందిన వారి ప్రభ వచ్చే మార్గంలో అప్పటికే టిడిపికి చెందిన వారి ప్రభ ఉండడంతో ఆగ్రహంగా ప్రభ వద్దకు వెళ్లిన వైసిపి వారు.. ప్రభను ఎందుకు నిలిపారని వాదనకు దిగారు. అంతటితో ఆగకుండా కర్రలు, రాళ్లతో దాడి చేశారు. దీదంతో టిడిపికి చెందిన యాదాల ఏడుకొండలు, మేకల ఆదెమ్మ, చిమట శ్రీనుకు తీవ్రంగా గాయాలయ్యాయి. మరికొందరికి స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న నరసరావుపేట రూరల్ పోలీసులు హుటాహుటిన గ్రామానికి చేరుకొని ఇరు గ్రూపులను చెదరగొట్టి క్షతగాత్రులను నరసరావుపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం ప్రభలను కొండకు పంపించి కొంతమంది పోలీసులు వాటి వెంట ఉన్నారు. క్షతగాత్రులను టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ పరామర్శించారు.

ప్రభ విరిగి ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - రెంటచింతల

కృష్ణా నది ఒడ్డునున్న సత్రశాల ఆలయం వద్ద మహాశివరాత్రి సందర్భంగా శనివారం ఏర్పాటు చేస్తున్న 70 అడుగుల విద్యుత్ ప్రభ విరిగి పడింది. నిర్మాణ పనుల్లో ఉన్న ఇద్దరు కార్మికులు గాయపడ్డంతో వారిని అంబులెన్స్ ద్వారా పిడుగురాళ్ల ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నరసరావుపేటకు తరలించినట్లు ప్రభ నిర్వాహకులు తెలిపారు.



కొండ ప్రాంత ప్రజల కష్టాలు గట్టెక్కేనా..?

తాడేపల్లి, సీతానగరం కొండలు సర్వే





ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలో కొండ పోరంబోకు ప్రాంతాల్లో నివాసముంటున్న దాదాపు రెండు వేల కుటుంబాల కష్టాలు గట్టెక్కెనా...! అనే ఆలోచనలు ప్రజల్లో కలుగుతున్నాయి. ఇటీవల ఉన్నతాధికారుల ఆదేశం మేరకు తాడేపల్లిలోని కొండలను రీ సర్వే చేశారు. ప్రధానంగా ముగ్గురోడ్డు నుండి ఉండవల్లి సెంటర్ వరకు, సంజీవనగర్, పోలకంపాడు, ఈఎస్ఐ పాత ఆసుపత్రి, ఒకటవ వార్డు, బోసుబొమ్మ సెంటర్, పద్మశాలీ బజారు, యాదవపాలెం, పోలీస్ స్టేషన్ వెనుకభాగం, బాలవెంకయ్య ఇంటి ప్రాంతాలు పెద్దఎత్తున కొండపోరంబోకు ప్రాంతంలో ప్రజలు నివాసముంటు న్నారు. ఈ కొండ సర్వే ప్రస్తుతం పూర్తయింది. 6, 12, 13 సచివాలయాల పరిధిలో ఉన్న ఈ ప్రాంతాన్ని సుమారు 15 సబ్‌డివిజన్లు చేశారు. ఇప్పటివరకు కొండప్రాంతం పైన ఇళ్లకు సబ్‌డివిజన్ జరగలేదు. సబ్‌డివిజన్ జరిగి ఈ ప్రాంతంలో ఎన్ని ఇళ్లు ఉన్నాయి, అందులో ఎంతమంది ప్రజలు నివాసముంటున్నారు అనేది నిర్ణయించి జనాభా లెక్కలు తీస్తారు. ఆ మేరకు ఉన్నతాధికారులకు సమాచారం అందజేస్తారు. ఇప్పటిదాకా ఈ కొండ చుట్టూ 50 సర్వే రాళ్లు పాతారు. సర్వే రాళ్లు పాతడానికి స్థానిక మున్సిపల్ జోనల్ కార్యాలయం దగ్గర సర్వేకు సంబంధించిన ఎక్విప్‌మెంట్ మిషన్ అమర్చారు. సర్వే కు వెళ్లిన వాళ్ల దగ్గర ఆ మిషన్‌కు సంబంధించిన టెక్నికల్ యాప్‌లో ఎక్కడెక్కడ సబ్‌డివిజన్లు ఏర్పాటు చేయవచ్చునేది సూచిస్తుంది. దాని ప్రకారం, సబ్‌డివిజన్లుగా రూపొందించారు.



ఇందుకు సంబంధించిన ఎక్విప్‌మెంట్ మిషన్ ఖరీదు రూ.18 లక్షలు ఉంటుంది. అయితే, అంత డబ్బు చెల్లించడానికి సుముఖత చూపని అధికారులు రోజుకు రూ.15,000 అద్దె చెల్లించి ఈ సర్వే నిర్వహించారు. సుమారు 20 రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగింది. ఇప్పటికి తాడేపల్లిలోని ముగ్గురోడ్డు నుండి ఉండవల్లి సెంటర్ వరకు పైన పేర్కొన్న ప్రాంతాల్లో విస్తరించి ఉన్న కొండ సర్వే పూర్తయింది. సీతానగరం, కెఎల్‌రావు కాలనీ కొండ సర్వే ఇంకా చేయాల్సి ఉంది. సర్వే మొత్తాన్ని డిప్యూటీ టౌన్ ప్లానింగ్ అధికారి, అసిస్టెంట్ టౌన్ ప్లానింగ్ అధికారి, తాడేపల్లి పట్టణ ప్రణాళికాధికారికి అందజేస్తారు. ఇప్పటివరకు కొండపోరంబోకు 201 సర్వే నెంబర్ పేరుపై ఉంది. సబ్ డివిజన్లు అయిన తర్వాత సర్వే నెంబర్ 201- కొత్త నెంబర్లు ఇస్తారు. దాని ప్రకారం రిజిస్ట్రేషన్లు కొండ ప్రాంత ప్రజలకు అవుతాయోమోనని గంపెండంత ఆశతో ఎదురుచూస్తున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా తాడేపల్లి కొండ ప్రాంతంలో రిజిస్ట్రేషన్లు నిలుపుదల చేశారు. దీంతో ఎక్కడికక్కడ క్రయవిక్రయాలు నిలిచిపోయాయి. దీనివల్ల ఇళ్లల్లో శుభకార్యాలు, ఇతర అవసరాల కోసం తమ స్థిరాస్తులు అయిన ఇళ్లు అమ్ముకోవడానికి వీల్లేకుండా పోయింది. గత కొన్ని రోజులుగా సర్వే నిర్వహిస్తున్న సిబ్బందిని, అధికారులను చూసి కొంతమంది భయాందోళనలకు గురవుతున్నారు. గత ప్రభుత్వం ఎన్నికలకు ముందు మంగళగిరి-విజయవాడ పాత జాతీయరహదారిని ప్రకాశం బ్యారేజ్ వద్ద నుండి కెఎల్‌రావు కాలనీ మీదుగా సంజీవనగర్, పోలకంపాడు వరకు సర్వే చేసి మార్కింగ్ ఇచ్చారు. అప్పట్లో మార్కింగ్ ఇచ్చినంత వరకూ ఇళ్లు తొలగించబడతాయని పెద్దఎత్తున ప్రచారం జరిగింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కృష్ణా తీరం.. జనసంద్రం..

సీతానగరానికి పోటెత్తిన జనం

ప్రజాశక్తి-తాడేపల్లి



మహాశివరాత్రి పర్వ దినం సందర్భంగా శనివారం కృష్ణాతీరం జనసంద్ర మైంది. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని సీతానగరం ప్రకాశం బ్యారేజ్ దిగువన కృష్ణా నదికి జనం పోటెత్తారు. ఉభయకృష్ణా, గుంటూరు జిల్లాల నుంచే కాక రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి సందర్శకులు తరలి వచ్చారు. విజయవాడ కనకదుర్గ ఆలయం దత్త ఆలయం అయిన శ్రీమద్ వీరాంజనేయ కోదండరామాల యంతో పాటు సీతానగరంలోని ఇంద్రకీలాద్రి, జీయర్ ఆశ్రమం, శివాలయంకు తెల్లవారుజాము నుంచే సందర్శకుల రాక మొదలైంది. ముందుగా నదిలో స్నానాలు ఆచరించి ఆపై వివిధ దేవాలయాలను సందర్శించారు. పుష్కరఘాట్లు, రైలు బ్రిడ్జి సమీపంలో అనుమతించిన ఘాట్లతో పాటు అధికారులు నిషేధం విధించిన ఘాట్ల వైపు కూడా ప్రమాదం అని తెలిసినా ఎక్కడికక్కడ స్నానాలు ఆచరించారు. అనేక స్వచ్ఛంద సంస్థలు మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. చిరు వ్యాపారాలు కూడా జోరుగా సాగాయని సంబంధిత వ్యక్తులు తెలిపారు.దేవాలయాల దగ్గర కొబ్బరికాయలు అధిక ధరల కన్నా ఎక్కువ ధరలకు విక్రయించారు.



సంగమేశ్వర స్వామి ఆలయం వద్ద బందోబస్తులో తెనాలి రూరల్ పోలీసులు

శివరాత్రి ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు

ప్రజాశక్తి - తెనాలి రూరల్

రూరల్ మండలం సంఘం జాగర్లమూడి గ్రామంలోని సంగమేశ్వర స్వామి ఆలయం వద్ద శివరాత్రి మహోత్సవంలో భాగంగా రూరల్ పోలీ సులు బందోబస్తు నిర్వహించారు. ఎస్సై సిహెచ్ వెంక టేశ్వర్లు ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగ కుండా, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. వాహనాల పార్కింగ్, క్యూలైన్లు వద్ద జాగ్రత్తలు తీసుకున్నారు. అదేవిధంగా గ్రామం నుండి దేవాలయం వరకు నిర్వహించిన రధోత్సవం పర్య వేక్షించారు.

కైలాగిరిలో సందర్శకులకు మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-గుంటూరు

మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని, పేరేచర్ల కైలాసగిరి క్షేత్రం వద్ద శనివారం గుంటూరు రూరల్ మండల జెడ్పీటీసి సభ్యులు తుమ్మల సుబ్బారావు ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో మండల వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.



మజ్జిగ పంపిణీని ప్రారంభిస్తున్న తుమ్మల సుబ్బారావు

న్యాయమూర్తి మనోహర్‌రెడ్డి కన్నుమూత

ప్రజాశక్తి - గుంటూరు లీగల్

కాకినాడలో అదనపు జిల్లా జడ్జిగా పని చేస్తూ సస్పెన్షన్‌కు గురైన జి.మనోహర్‌రెడ్డి గుంటూరులోని తన నివాసంలో శనివారం మృతి చెందారు. పల్నాడు జిల్లా రెంటచింతల మండలం రెంటాలకు చెందిన మనోహర్‌రెడ్డి ఏలూరులోని సిఆర్ రెడ్డి లా కాలేజీలో న్యాయశాస్త్రం అభ్యసించారు. అనంతరం గుంటూరులో న్యాయవాద వృత్తిని చేపట్టారు. కొన్నాళ్లు ప్రాక్టీస్ అనంతరం ఎపిపిగా ఎంపికై సత్తెనపల్లి, పొన్నూరు, నరసరావుపేట కోర్టులో పని చేశారు. ఆ క్రమంలో జిల్లా జడ్జి పరీక్షలు రాసి అదనపు జిల్లా జడ్జిగా ఎంపికయ్యారు. తొలుత పొద్దుటూరు అదనపు జిల్లా కోర్టులో న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. వైసిపి అధికారంలోకి వచ్చాక న్యాయ శాఖ కార్యదర్శిగా పని చేస్తున్న సమయంలో హైకోర్టు ఆయన్ను ఒంగోలులోని ఫ్యామిటీ కోర్టు న్యాయమూర్తిగా నియమించింది. కొద్ది కాలానికి కాకినాడ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. అదే సమయంలో ఆయనపై ఓ అభియోగం రాబడం, అప్పటికే మరికొన్ని అభియోగాలు ఉండడంతో ఆయన్ను హైకోర్టు సస్పెండ్ చేసింది. అప్పటి నుండి ఆయన గుంటూరులో ఉంటున్నారు. ఈ క్రమంలో శనివారం తెల్లవారినా ఆయన నిద్ర లేవకపోవడంతో కుటుంబీకులు వెళ్లి పరిశీలించారు. చలనం ఏమీ లేకపోవడంతో 108కు సమచారం ఇచ్చారు. వెంటనే వచ్చిన 108 సిబ్బంది అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. మనోహర్‌రెడ్డికి భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. భార్య ఒంగోలు వినియోగదారుల ఫోరం చైర్మన్‌గా పని చేస్తున్నారు. మనోహర్‌రెడ్డి భౌతికకాయాన్ని గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారధి, గుంటూరు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు పోలూరి వెంకటరెడ్డి, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు వి.బ్రహ్మారెడ్డి, పలువురు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, న్యాయవాదులు సందర్శించి నివాళులర్పించారు. భౌతిక కాయాన్ని రెంటాలకు తరలించారు. అంత్యక్రియలు ఆదివారం నిర్వహిస్తామని కుటుంబీకులు తెలిపారు.





సంక్షేమ బోర్డును కాపాడుకోవాలి

ప్రచార కరపత్రాన్ని ఆవిష్కరించిన సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-తాడేపల్లి

సంక్షేమబోర్డు పరిరక్షణ కోసం సంఘాన్ని బలోపేతం చేద్దాం రండి అని తాడేపల్లి సిఐటియు కార్యదర్శి వేముల దుర్గారావు పిలుపునిచ్చారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ సంఘం తాడేపల్లి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన సంక్షేమ బోర్డు పరిరక్షణకై ఉద్యమించండి అనే కరపత్రాన్ని సుందరయ్య నగర్ భవననిర్మాణ కార్మిక సంక్షేమ సంఘం కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ 199లో అనేక పోరాటాల ఫలితంగా భవననిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంగతిని గుర్తుచేశారు. నేడు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఈ బోర్డును నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. సెస్ రూపంలో సంక్షేమ బోర్డుకు కోట్లాది రూపాయల నిధులు సమకూరుతున్నాయని చెప్పారు. పని ప్రదేశంలో కార్మికులకు ఏదైనా ప్రమాదం జరిగితే వినియోగించాల్సిన ఈ నిధులను ప్రభుత్వం ఇతర పథకాలకు మళ్లిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కరోనా సమయంలో స్థానిక భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మికులకు నిత్యావసరాలు అందించడం జరిగిందని చెప్పారు. ఈ కాలంలో వివిధ చోట్ల జరిగిన ప్రమాదాల్లో నిర్మాణ కార్మికులకు రూ.7 లక్షలు పరిహారంగా ఇప్పించడం జరిగిందని చెప్పారు. కార్యక్రమంలో కె.బాబూరావు, సిహెచ్ భుజంగరావు, చంద్రశేఖర్, కె.కరుణాకర్‌రావు, శ్యామ్, వి.శాస్త్రి, రమేశ్ పాల్గొన్నారు.



సిపిఎం అభిమాని ఎలిశమ్మ కన్నుమూత

ప్రజాశక్తి - దుగ్గిరాల

సిపిఎం అభిమాని కుంచకర ఎలిశమ్మ శనివారం కన్నుమూశారు. ఆమె భౌతికకాయానికి సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు, మండల కార్యదర్శి జెట్టి బాలరాజు, నాయకులు వి సాంబశివరావు, వై స్టాలిన్, ఎం నాగమల్లేశ్వరరావు, వై బ్రహ్మేశ్వరరావు, బాలాజి తదితరులు నివాళులర్పించారు. ఈసందర్భంగా జెవి రాఘవులు మాట్లాడుతు ఎలిశమ్మ కుటుంబం, కుమారుడు జోజి గ్రామంలో పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గాపాల్గొంటారని తెలిపారు.

దినదినగండంగా పరిశ్రమల్లో పనులు

- చిలకలూరిపేటలో వెలవెలబోతున్న పారిశ్రామికవాడ
- ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న పరిశ్రమలు
- బిక్కుబిక్కుమంటున్న కార్మిక కుటుంబాలు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

చిలకలూరిపేట నియోజకవర్గంలోని స్పిన్నింగ్, జిన్నింగ్, కాటన్, ఆయిల్, ప్రత్తి విత్తనాల నుంచి దూదిని,విత్తనాలను వేరు చేసే కంపెనీలు, గ్రానైట్, పొగాకు పరి శ్రమల్లో పనిచేస్తున్న ఉద్యోగుల పరిస్థితి రోజు రోజుకీ అగమ్యగోచరంగా తయారవుతోంది. చిలకలూరిపేట నుంచి మార్టూరు, బోయపాలెం వరకు సుమారు 20 స్పిన్నింగ్ మిల్లులు, 50 జిన్నింగ్, కాటన్ మిల్లులు, ఆయిల్, డివెంటర్స్ మిల్లులు 15, గ్రానైట్ పరిశ్రమలు 150 నుంచి 200, పొగాకు పరిశ్రమలు 35 నుంచి 40 వరకు ఉన్నాయి. ఆయా పరిశ్రమల్లో పనిచేస్తున్న గుమాస్తాలు సుమారు రెండు వేల మంది వరకు ఉన్నారు. ఆయా మిల్లుల్లో పని చేసే వారిని ఒక నెలలో సగం రోజులు, 20 రోజులు మాత్రమే రమ్మంటున్నారు. ఇంకొన్ని మిల్లుల్లో అయితే నెల మొత్తం పని చేసి 20 రోజులకు మాత్రమే జీతాలు ఇస్తున్నారు. కంపెనీల్లో పని చేసే ఉద్యోగస్తులనైతే షిఫ్ట్ పద్ధతిలో రావాలని, లేకుంటే బలవంతపు సెలవులు తీసు కోవా లంటూ వారిపై యాజమాన్యాలు ఒత్తిడి చేసే పరిస్థితి. సుమారు ఇరవై నుంచి ఇరవై ఐదేళ్లుగా ఆయా మిల్లుల్లో పని చేస్తున్నామని, ప్రస్తుతం తాము పని చేసే మిల్లులు ఆర్థిక సంక్షోభంలో ఉన్నా యని, ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నట్లు వారు చెబుతున్నారు. ఈఎస్ఐ, మెడికల్, పిఎఫ్ వంటి సౌకర్యాలు పొందుతున్న ఉద్యోగులు ప్రస్తుతం తమ కుటుంబాలు గడవని పరి స్థితుల్లో వున్నాయని చెప్పారు.

ఇదే పరిస్థితి కొనసాగితే రాబోయే కాలంలో పస్తులుండాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు.


నామమాత్రంగా పనిచేస్తున్న గణపవరంలోని ఓ మిల్లు


గణపవరంలోని లింట్ ఫ్యాక్టరీ

విద్యుత్తు ఖర్చులు భరించలేకపోతున్నాం

ఒక మిల్లు యజమాని మాటల్లో.....కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పత్తి పంటను అభివృద్ధి చేయకపోవడంతో దాని స్థానంలో సింథటిక్ (పాలిస్టర్ విస్కోస్)ను అభివృద్ధి చేయాల్సి వచ్చిందన్నారు. సింథటిక్ వస్తు వులు కావాలంటే పరిశ్రమల వారి వద్ద నుంచి తీసుకోవాలి. ప్రత్తి పంట తగ్గిపోవడం, ప్రత్యామ్నాయం లేకపోవడంతో పరి శ్రమలకు కావాల్సిన సింథటిక్ సరఫరా చేసే వాళ్ళు ఏక ఛత్రాధిపత్యం చేస్తున్నారం టున్నారు. దానికి తోడు విద్యుత్తు ఖర్చులు ఇతర పరిశ్రమలకు సంబంధించిన ఖర్చు లు, ముఖ్యంగా పొల్యూషన్, యూజర్ చార్జీలు,నాళా చార్జీలు, స్థానిక పన్నులు భారీగా పెరిగిపోయాయని దీంతో పరి శ్రమ నడప లేకపోతున్నామన్నారు.

సబ్సిడిని వెంటనే విడుదల చేయండి

పరిశ్రమల్లో వేల సంఖ్యలో పని చేసే కార్మికులపై టీ కొట్లు, టిఫిన్ బండ్లు, చిరు వ్యాపారులు ఆధారపడ్డారని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పేరుబోయిన వెంకటేశ్వర్లు చెప్పారు. ప్రస్తుతం పరిశ్రమలు, మిల్లుల పరిస్థితి బాగోలేకపోవడంతో వాటిలో పనిచేసే ఉద్యోగస్తులతో పాటు రోజువారి కూలీ పనులు చేసుకునే వారి కొనుగోలు శక్తి తగ్గిపోయిందని చెప్పారు. వందలాది కూలీలు తమ ఉపాధి కోల్పోయి రోడ్డునపడ్డారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పూనుకొని ప్రస్తుతం ఉన్న మిల్లులకు సబ్సిడి రూపంలో రావాల్సిన డబ్బులను విడుదల చేసి పరిశ్రమలను కాపాడాలని డిమాండ్ చేశారు.


గణపవరంలోని దారం మిల్లు

వాతావరణంలో మార్పులతో పిల్లలకు వ్యాధులు

ప్రజాశక్తి - చిలకలూరిపేట



ప్రజలు జ్వరం,జలుబు, దగ్గు బారిన పడుతుండగా, చిన్నపిల్లల్లో ఆటలమ్మ వేగంగా వ్యాప్తి చెందుతోంది. వేసవికాలం వచ్చే ముందు వాతావరణంలో సంభవించే మార్పుల కారణంగా వ్యాధులు వ్యాప్తి చెందడం సాధారణంగా జరుగుతుందని వైద్యులు చెబుతున్నారు. జాగ్రత్తలు పాటించాలని పిల్లల వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రముఖ పిల్లల వైద్యులు సిద్ధార్థ మాట్లాడుతూ చలికాలం నుంచి వేసవి కాలం వచ్చే సమయంలో వాతావరణంలో మార్పు లతో చిన్నపిల్లల్లో వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. గొంతు నొప్పి, జలుబు, దగ్గు, జ్వరము ఇన్ ఫెక్షన్‌కు చిన్నపిల్లలు గురవుతారని అన్నారు. చర్మ సంబంధిత, చెవి, ముక్కు, గొంతు ఇన్ఫెక్షన్ కూడా వస్తుందని, పిల్లలకు జ్వరం వస్తే డిహైడ్రేట్ అవ్వకుండా చూసుకోవా లని, అవ సరం లేకుండా యాంటిబయాటిక్ మందులు వాడ కూడదని చెప్పారు. మనం ఉండే పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు.

ఆటలమ్మ సోకిన వారిని ప్రత్యేకంగా ఉంచండి

ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు కొల్లా అమర్ మాట్లాడుతూ జ్వరము, దగ్గు, జలుబు, చర్మ సంబందిత సమస్యలతో చికిత్స కు వచ్చే చిన్నారుల సంఖ్య పెరుగుతోందని చెప్పారు. కొంత మంది పిల్లలు ఇంటి వద్ద చికిత్స పొందుతున్నారని, ఎక్కువ మంది పిల్లలు ఉన్న ఇంట్లో ఆటలమ్మ సోకిన వారిని ప్రత్యేకంగా ఉంచాలని, కంగారు పడాల్సిన అవసరం లేదని తల్లిదండ్రులకు సూచించారు. ఎండ సమయంలో బయటకు రాకుండా ఉండటం, కాచిన నీరు తాగడం, పండ్లు, ఆకు కూరలు, తేలికపాటి ద్రవపదార్థాలను తీసుకోవాలని సూచించారు. దోమల బారిన పడకుండా తగు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు.



వేముల ఛారిటబుల్ ట్రస్ట్ అన్నదానం

ప్రజాశక్తి - మాచర్ల

వేముల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వేముల కిరణ్‌కుమార్ జయంతి సందర్భంగా మాచర్ల ప్రభుత్వ వైద్యశాలలో శనివారం అన్న దాన కార్యక్రమం నిర్వహించారు. వేముల సుబ్బారావు, మణికుమార్, కిరణ్‌కుమార్‌ల జ్ఞాప కార్థం ఏర్పాటు చేసిన ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇప్ప టికే పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సుబ్బారావు భార్య వేముల మాధవి మాట్లాడుతూ గత రెండేళ్లుగా విద్యా, వైద్యపరంగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ట్రస్ట్ కన్వీనర్ టి. సాంబశివరావు, వాసవీ క్లబ్ అధ్యక్షులు ఓరుగంటి చెన్నకేశవరావు తదితరులు పాల్గొన్నారు.

అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నోటిఫికేషన్

ప్రజాశక్తి-గుంటూరు

కర్నూలు, ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు, అనంతపురం, వైఎస్ఆర్ కడప, గుంటూరు, ప్రకాశం, చిత్తూరు, బాపట్ల, పల్నాడు, నంద్యాల, తిరుపతి, జిల్లాలకు చెందిన అవివాహిత పురుష అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తూ గుంటూ రులోని ఆర్మీ రిక్రూటింగ్ కార్యాలయం బుధవారం అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి సంబంధించి తాజా నోటి ఫికేషన్‌ను విడుదల చేసింది. రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ మార్చి 15. ఫేజ్-1లో ఆన్‌లైన్ కంప్యూటర్ ఆధారిత రాత పరీక్ష (ఆన్‌లైన్ సిఇఇ) ఏప్రిల్ 17 నుండి వివిధ కేంద్రాల్లో నిర్వహించనున్నారు. తర్వాత దశ-2లో రిక్రూట్‌మెంట్ ర్యాలీ జరుగుతుంది. అభ్యర్థులు www. joinindianarmy.nic. ఇఅ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

నియంత పరిపాలనలా ఉంది : టిడిపి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి చౌట శ్రీనివాసరావు విమర్శించారు. తూర్పుగోదావరి జిల్లా అనపర్తిలో టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు సభ ను పోలీసులు అడ్డుకోవడంపై సత్తెనపల్లి టిడిపి ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్ర హం వద్ద శనివారం నిరసన వ్యక్తం చేశారు. చౌట శ్రీనివాసరావు మాట్లాడుతూ చంద్రబాబు సభలను అడ్డుకోవడం నియంత పరిపాలనలా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను పరిరక్షించాలని కోరుతూ డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా పార్టీ అధికార ప్రతినిధి ఎ.సాంబయ్య, జిల్లా కార్యదర్శి బి.చంద్రశేఖర్,పట్టణ పార్టీ అధ్యక్షులు కె.రామకృష్ణ, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి వి.అజయ్, ఎస్సి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. **పెదకూరపాడు:** స్థానిక ఎన్టీఆర్ విగ్రహం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు శనివారం ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. పెదకూర పాడు మండల టిడిపి అధ్యక్షులు ఎ.రమేష్, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.


పెదకూరపాడులో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న టిడిపి నాయకులు


సత్తెనపల్లిలో అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పిస్తున్న టిడిపి నాయకులు

రాష్ట్ర స్థాయి పోటీలకు కేంద్రీయ విద్యార్థినిలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా క్రీడా సంబంధమైన, ఫిట్నెస్ సంబంధించిన అంశాల్లో నిర్వహించే ఫిట్ ఇండియా క్విజ్ పోటీల్లో సత్తెనపల్లి కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు విశేష ప్రతిభ కన బరిచి ర్యాంకులు సాధించారు. 10వ తరగతి విద్యార్థిని జొన్నలగడ్డ అను నాల్గో ర్యాంక్, 9వ తరగతి విద్యార్థి రమావత్ పార్థవి సాయి నవ్యశ్రీ 19వ ర్యాంక్ సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు వీరు ఎంపికైనట్లు కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ బి.కిరణ్‌రెడ్డి తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ నుండి స్టేట్ రౌం డ్‌కు 16 పాఠశాలలు ఎంపిక కాగా, అందులో సత్తెనపల్లి కేంద్రీయ విద్యాలయం ఉండడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సం దర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.


జొన్నలగడ్డ అను


రూపావత్ పార్థవి సాయి

ప్రజాశక్తి 7
గుంటూరు జిల్లా
ఆదివారం 19 ఫిబ్రవరి 2023

నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ ఈసారైనా పూర్తయ్యేనా?

- ఎట్టకేలకు పున: ప్రారంభమైన పనులు
- నిర్మాణ పనులపై దాదాపు పదేళ్లుగా సాగతీత
- పూర్తిచేస్తారో..? హడావుడితో సరిపెడతారో?

ప్రజాశక్తి-తెనాలి

నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ పనులు ఎట్టకేలకు పున:ప్రారంభమయ్యాయి. ఈ దఫా అయినా పూర్తి చేస్తారో, హడావుడి చేసి వదిలేస్తారో చూడాలి. కేవలం ఏడెనిమిది కిలోమీటర్ల మేర నిర్మించాల్సిన రోడ్డు విస్తరణ పనులు దాదాపు పదేళ్ళ నుంచి సాగుతూనే ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా ప్రారంభించిన పనులు తదుపరి టిడిపి, ఆ తర్వాత వైసిపి అధికారంలోకి వచ్చినా పూర్తి కాలేదు. ముచ్చటగా ముగ్గురు ఎమ్మెల్యేలు మారినా పూర్తి కాని రోడ్డు నిర్మాణం, ఈ దఫా అయినా పూర్తి చేస్తారా అనే సందేహాలు ప్రజల్లో వ్యక్తమౌతున్నాయి. విజయవాడ-చందోలు మార్గంలో ఆటోనగర్ నుంచి పెదరావూరు వంకు నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ పనుల వివరాలు..

తెనాలి పట్టణానికి పలు ప్రాంతాల నుంచి నిత్యం వచ్చి పోయే వారి సంఖ్య దాదాపు 40 వేల వరకు ఉంటుంది. విజయవాడ,మంగళగిరి,దుగ్గిరాల, వేమూరు,కొల్లూరు, చెరుకుపల్లి, పొన్నూరు, చందోలు,బాపట్ల తదితర ప్రాంతాల నుంచి వచ్చి పోయే వాహనాల రద్దీ దృష్ట్యా పెదరావూరు నుంచి నందివెలుగు వరకు రోడ్డు విస్తరణకు కాంగ్రెస్ హయాంలో అప్పటి శాసనసభ్యులు నాందెడ్ల మనోహర్ ప్రతిపాదించారు. రోడ్డుకు ఇరువైపులా కాలువలు ఉండటంతో రివిట్‌మెంట్ లేక రోడ్డు కుంగిపోతున్న పరిస్థితిని అధిగమించేందుకు పెదరావూరు నుంచి నంది వెలుగు వరకూ నాలుగు లైన్ల రోడ్డు విస్తరణకు సన్నాహాలు చేశారు. అనివార్య కారణాలతో దానిని పెదరావూరు నుంచి ఆటోనగర్ వరకు కుదించారు. ఈ పనులను ప్రారంభించిన మనోహర్ పెదరావూరు నుంచి ఆర్టీసి బస్టాండ్ వరకూ పూర్తి చేశారు. తదుపరి టిడిపి అధికారం లోకి రావడంతో ఆలపాటి రాజేంద్రప్రసాద్ హయాంలో బస్టాండ్ నుంచి విఎస్సార్ కళా శాల వరకూ కొంత మేర పనులు చేశారు. అలాగే, విస్సార్ కళాశాల నుంచి ఆటోనగర్ వరకూ ఎడమవైపు రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేశారు. మిగిలింది ఆటోనగర్ నుంచి విఎస్సార్ కళాశాల వరకూ రెండో వైపు రోడ్డు నిర్మాణమే. ఇంతలో ప్రభుత్వం మార డంతో వైసిపి అధికారంలోకి వచ్చింది. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ నేతృత్వంలో ఇప్పటికి దాదాపు నాలుగేళ్లు గడుస్తున్నా రోడ్డు నిర్మాణంపై ఏమాత్రం శ్రద్ధ చూపలేదు. దీంతో గతంలో నిర్మించిన రోడ్డుతో పాటు, నిర్మించాల్సి ఉన్న రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. గత ఏడాది వేసవిలో రోడ్డు నిర్మాణ పనులు నామ మాత్రంగా చేశారు. తూర్పు కాలువ అంచున ఏర్పాటు చేసిన రిటెయినింగ్ వాల్‌కు, రోడ్డుకు మధ్య గ్రావెల్‌తో నింపి వదిలేశారు. ఈ పరిస్థితుల్లో ఉన్న రోడ్డు కూడా పూర్తిగా దెబ్బతింది. కనీసం ద్విచక్ర వాహనాలు కూడా నడిచేందుకు వీలులేని పరిస్థితి నెలకొంది. ఆటోనగర్ నుంచి తెనాలి చేరాలంటే రోడ్డు నరకప్రాయంగా మారింది. ఎన్నో వాహనాలు ప్రమాదాలకు గురైన సందర్భాలు లేకపోలేదు. రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన డివైడర్లకు రంగులు వేయించడం కాని, ప్రమాదాల నివారణకు కనీసం రేడియం స్టిక్కర్లు కూడా ఏర్పాటు చేయలేకపోయారు.

త్వరితగతిన పూర్తి చేస్తాం

నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ పనులు ఓ వైపు పనులు పూర్తయినా రోడ్డుకు రెండో వైపు పనులు పెండింగ్‌లో ఉన్నాయని తెనాలి ఆర్అండ్‌బి డిఇ నాగేశ్వరరావు చెప్పారు. ఆటోనగర్ నుంచి విఎస్సార్ కళాశాల వరకూ రోడ్డు నిర్మించాల్సి ఉంది. రీటెయి నింగ్ వాల్ ఎత్తు కూడా పెంచాల్సి ఉంది. ప్రస్తుతం రోడ్డుకు, రీటెయినింగ్ వాల్‌కు మధ్య ఉన్న గ్యాప్‌ను ఫిల్ చేస్తున్నట్లు చెప్పారు. సాధ్యమైనంత త్వరగా నిర్మాణ పనులు పూర్తి చేస్తామని అన్నారు.



ప్రారంభమైన రోడ్డు నిర్మాణ పనులు



ప్రస్తుతం నెలకొన్న రోడ్డు దుస్థితి



నాలుగు లైన్ల రోడ్డు ఇదే

పున:ప్రారంభమైన రోడ్డు నిర్మాణ పనులు

ఎట్టకేలకు తాజాగా రోడ్డు నిర్మాణ పనులు పున:ప్రారంభించారు. ఆటోనగర్ నుంచి విఎస్సార్ కళాశాల వరకూ తూర్పు కాలువ అంచునున్న రీటెయినింగ్ వాల్‌కు, రోడ్డుకు మధ్య పెద్దరాయి, గ్రావెల్‌తో నింపుతున్నారు. దాదాపు వారం నుంచి పనులు జరుగుతున్నాయి.

మూడు వేల మందికి వైద్య పరీక్షలు


ప్రజాశక్తి-తాడేపల్లి: తాడేపల్లిలోని నులకపేట వద్ద గల శివకేశవనగర్‌లోని చైతన్య తపోవనం రజతోత్సవాల సందర్భంగా శనివారం 3,046 మందికి ఉచిత వైద్య సేవలందించారు. విజయవాడ ఎంజెనాయుడు సూపర్ స్పెషాల్టీ ఆసుపత్రి ఆధ్వర్యంలో మెగా ఆర్థో వైద్య సేవా శిబిరానికి విశేష స్పందన లభించింది. బిపి, షుగర్‌తో పాటు ఎముకల అరుగుదల పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. అలాగే, మందులు కూడా ఉచితంగా పంపిణీ చేశారు. అధునాతన చికిత్సా విధానాలు అనే అంశంపై వచ్చిన వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమాన్ని మాత శివ చైతన్యానంద ప్రారంభించారు. డాక్టర్లు రవితేజ, వంశీకృష్ణ,మణికుమార్, సందీప్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కుంచనపల్లి-రేవేంద్రపాడు రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఎంటి ఎంసి పరిధిలోని కుంచనపల్లి నుండి రేవేంద్రపాడు వరకు గల రోడ్డు విస్తరణ పనులను వేగవంతం చేయాలని అధికారులకు మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకష్ణారెడ్డి సూచించారు. శనివారం విస్తరణ పనులను స్థానిక ప్రజలతో కొబ్బరి కాయలు కొట్టించిన ఆయన పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సుమారు రూ.15 కోట్ల నిధులతో రోడ్డును విస్తరిస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా, రూ.5 కోట్ల నిధులతో పాత రోడ్డులో ఉన్న 33 కెవి, 11 కె.వి, ఎల్.టి విద్యుత్ లైన్ల షిఫ్టింగ్ పనులను కూడా ప్రారంభించారు. కార్యక్రమంలో తాడేపల్లి వైసిపి మండల నాయకులు మున్నంగి వివేకానందరెడ్డి, కుంచనపల్లి గ్రామ అధ్యక్షులు మిరియాల రాంబాబు, కొలను కొండ గ్రామ నాయకులు నూతక్కి శ్రీనివాసరావు, నగరపాలక సంస్థ, విద్యుత్ శాఖ ఉన్నత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





స్థానికుడితో కొబ్బరికాయ కొట్టించి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే

నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మంగళగిరి: మంగళగిరి పట్టణంలో చేపట్టిన అభివృద్ధి నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి నగరపాలక సంస్థ అధికారులకు, కాంట్రాక్టర్‌కు సూచించారు. మంగళగిరిలో శనివారం ఆయన విస్తృతంగా పర్యటించారు. పాత బస్టాండ్ సెంటర్ ప్రగడ కోటయ్య ప్రాంగణంలో జరుగుతున్న వైఎస్సార్ చేనేత భవన్ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం జగనన్న కాలనీ వద్ద సుమారు రూ.7 కోట్ల వ్యయంతో చేపట్టిన విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులను పరిశీలించారు. అత్యాధునిక సాంకేతిక టెక్నాలజీతో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం జరుగుతోందని, రానున్న కాలంలో జగనన్న కాలనీలో ప్రజలకు ఎటువంటి విద్యుత్ సమస్యలు తలెత్తకుండా దీనిని నిర్మిస్తున్నట్లు చెప్పారు. సబ్ స్టేషన్‌ను పూర్తి నాణ్యతా ప్రమాణాతో నిర్మించాలని, ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు, కాంట్రాక్టర్ కు సూచించారు. రానున్న ఏప్రిల్ మొదటి వారానికి సబ్ స్టేషన్ నిర్మాణ పనులను పూర్తి చేయాలని అన్నా రు. అనంతరం నగరంలోని తెనాలి రోడ్డు గుంటూరు ఛానల్ వెంబడి రక్షిత మంచినీటి పథకం వద్ద సుమారు రూ.2.5 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఇండోర్ స్విమ్మింగ్ ఫూల్ నిర్మాణ పనులను, రూ.1.50 కోట్లతో చేపట్టిన స్కేటింగ్ రింక్ నిర్మాణ పనులను, శుద్ధి చేయబడిన నీటిని పంపింగ్ చేసే కృష్ణ వాటర్ పంప్ హౌస్ నిర్మాణ పనులను, పంప్ హౌస్ వద్ద సుమారు రూ.50 లక్షల నిధులతో చేపట్టిన సిసి డ్రైనేజీ నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు.



ప్రసాదాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

భగీరథ సగర సంఘం ప్రసాదం పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామివారి దేవస్థానంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని స్థానిక భగీరథ సగర సంఘం ఆధ్వర్యంలో శనివారం రాత్రి ప్రసాదాలు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు హాజరై ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శివరాత్రి పర్వదినాన సగర సంఘం భక్తులకు పులిహోర, దద్దోజనం, రవ్వ కేసరి ప్రసాదాలు పంపినీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు ఎం.మల్లేశ్వరరావు, సంఘం అధ్యక్షులు పం దేటి సాంబశివరావు, నాయకులు కె. శివ సత్యనారాయణ, జె.ఏడుకొండలు, కె.విష్ణుమూర్తి, కె.శ్రీనివాసరావు, ఎం.సుబ్బారావు, జి. అచ్చయ్య, రెడ్డి వీరరాఘవ, ఎన్. గోపాలకృష్ణ పాల్గొన్నారు.

నేటి నుంచి యోగా ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - మంగళగిరి

శ్రీ రాధాకృష్ణా యోగ సేవ కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీ నుంచి ఉచిత యోగ శిక్షణ శిబిరం ప్రారంభమవుతుందని యోగశిక్షణ కేంద్రం వ్యవస్థాపకులు ప్రధాన యోగా చార్యులు పడమట రాధాకృష్ణా యోగి గురూజీ తెలిపారు. మంగళగిరి శ్రీ లక్ష్మీనారాయణ స్వామి దేవస్థానం ఆవరణలో ప్రతిరోజు సాయంత్రం 6 గంటలకు జరిగే యోగా శిక్షణ తరగతుల్లో యోగాసనాలు, ప్రాణాయామం,ధ్యానంలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. యోగా శిక్షణ ద్వారా షుగరు, బిపి, గ్యాస్ ట్రబుల్, మలబద్ధకం, అధిక బరువు, గుండె దడ, వంటివి మటుమాయమవుతాయని అన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గురూజీ విజ్ఞప్తి చేశారు.



అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

ప్రజల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వం : టిడిపి

చంద్రబాబు పర్యటన అడ్డుకున్న పోలీసుల తీరుపై నిరసన

ప్రజాశక్తి-తెనాలి

అధికారం ఉందన్న అహంకారంతో వైసిపి ప్రభుత్వం ప్రజల హక్కులను కాలరాస్తోందని టిడిపి నాయకులు ధ్వజమెత్తారు.టిడిపి అధినేత చంద్రబాబునాయుడు పర్యటనను అనపర్తిలో అడ్డుకున్న పోలీసుల తీరును వారు నిరసించారు. శనివారం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వానికి కొమ్ము కాస్తూ, అది చాలదన్నట్లు పోలీసులు నిరసనకు దిగడం బాధ్యతాహిత్యమేనని ఆరోపించారు. అధికార పార్టీ తీరును ప్రజలు గమనిస్తున్నారని, బుద్ధి చెప్పే రోజు త్వరలోనే ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు టి.హరిప్రసాద్, కె.కనకరాంబాబు, కె.ఏడుకొండలు, కోపల్లె శ్రీను, మల్లవరపు విజయకుమార్, బి.ప్రసాద్, డి.శ్యామ్, అత్తోట శరత్, జొన్నాదుల మహేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డొక్కా మాణిక్యవరప్రసాద్, వేదికపైన ప్రజాశక్తి ఎడిటర్ తులసీదాసు, సిజిఎం వై అచ్యుతరావు, ఎస్ వెంకట్రావు తదితరులు

విజయవాడ పుస్తక మహోత్సవానికి

సందర్శకుల వెల్లువ

నేడు పుస్తక మహోత్సవం ముగింపు సభ

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరుగుతున్న పుస్తక మహోత్సవ్‌లో శనివారం సెలవు రోజు కావడంతో పెద్ద సంఖ్యలో పుస్తక ప్రియులు, సందర్శకులు పాల్గొన్నారు. పుస్తక మహోత్సవ్‌కు ఆదివారం చివరి రోజు కావడంతో పెద్ద సంఖ్యలో పుస్తక ప్రియులు పాల్గోనున్నారు. శనివారం సాయంత్రం పుస్తక మహక్షత్సవ్‌లోని సాహత్య వేదికపై పలు సాహిత్య కార్యక్రమాలు జరగ్గా ప్రతిభా వేదికపై విద్యార్థుల కోసం వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. సాహిత్య వేదికపై అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా నూతన జాతీయ విద్యా విధానం – మాతృభాషలు అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో పంజాబ్ విశ్వవిద్యాలయం భాషాశాస్త్ర ఆచార్యులు ఆచార్య జోగాసింహ్ పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో తెలుగుభాషోద్యమ సమాఖ్య అధ్యక్షులు ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. సాహిత్య వేదికపై తెలుగు సాహిత్యం డిజిటీకరణ – గ్రంథాలయాలు అనే అంశంపై జరిగిన సదస్సుకు రహమనుద్దీన్ అధ్యక్షత వహించగా మనసు ఫౌండేషన్ నుండి ఎం.వి. రాముడు , గ్రంథాలయ పరిషత్ చైర్మన్ ఎం.శేషగిరిరావు, అనంతపురంకు చెందిన వైద్యులు డాక్టర్ గేయానంద్ పాల్గొని ప్రసంగించారు. ఆదివారం పుస్తక మహోత్సవం ముగింపు సభ సాయంత్రం 6 గంటలకు గొల్లపూడి మారుతీరావు సాహిత్య వేదికపై జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా కలెక్టర్ డిల్లీరావు, మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండరీకర్, పోలీస్ కమిషనర్ క్రాంతి రాణా టాటా హాజరుకానున్నారు.

విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలి

ప్రతి విద్యార్థి పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని తద్వారా అవి జీవితానికి బాటలు వేస్తాయని పాఠశాల విద్యాశాఖ కమిషనర్, సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు ఎస్.సురేష్‌కుమార్ అన్నారు. పుస్తక మహోత్సవంలో పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్షా ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాలును శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన కళాకృతులు, రోబోటిక్స్, జగనన్న విద్యాకానుక కిట్, బైలింగ్వల్ పాఠ్యపుస్తకాలు వంటివి పరిశీలించి విద్యార్థులను అభినందించారు. గంపలగూడెం కేజీబీవీ విద్యార్థినులు ప్రదర్శించిన నత్యాన్ని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ బుక్ ఫెస్ట్ నిర్వాహకులు మనోహర్ నాయుడు, లక్ష్మయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కెఎస్ లక్ష్మణరావు, ఎంవిఎస్ శర్మ, బి.తులసీదాసు











మాట్లాడుతున్న పాశం రామారావు

రాష్ట్రానికి కేంద్రం తీరని అన్యాయం

సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు

ప్రజాశక్తి - అమరావతి : ప్రజా ప్రతినిధిగా ప్రజలకు సేవ ఎలా చేయాలో నిరూపించిన వ్యక్తి తల్లం బ్రహ్మయ్య అని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. అమరావతి గ్రామ మాజీ సర్పంచ్, సిపిఎం నాయకులు తల్లం బ్రహ్మయ్య 22వ వర్ధంతి సభ మోహదీన్ వలి అధ్యక్షతన తల్లం బ్రహ్మయ్య స్మారక భవన్‌లో శనివారం జరిగింది. ఈ సందర్భంగా పాశం రామారావు మాట్లాడుతూ అమరావతి ప్రాంతంలో సిపిఎం నాయకుడిగా పొగాకు కార్మికుల, రైతుల సమస్యలపై నిర్వహించిన పోరాటాలలో తల్లం బ్రహ్మయ్య కీలకపాత్ర వహించారని అన్నారు. అమరావతి గ్రామం పంచాయతీ సర్పంచ్‌గా గ్రామ అభివృద్ధిలో నిస్వార్ధంగా తన సొంత నిధులను కూడా కేటాయించి ప్రజా ప్రతినిధి అని అంటే ఏ విధంగా నిస్వార్ధంగా పని చేయవచ్చు అని నిరూపించిన వ్యక్తి అని కొనియాడారు. సామాజిక ఆర్థిక అసమానతలు కలిగిన ఈ సమాజంలో ప్రజలందరూ సమానంగా జీవించే సమ సమాజం రావాలని కోరుకున్నారని, కడ వరకూ కమ్యూనిస్టు విలువలతో జీవించారని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో పనిచేయటమే బ్రహ్మయ్యకి ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలపై భారాలు వేసి సంక్షేమ పథకాలకు కోతలు పెట్టి కార్పొరేట్‌లకు లాభాలు చేకూర్చేదిగా ఉందన్నారు. ప్రధాని మోడీ శంకుస్థాపన చేసిన రాజధాని నిర్మాణానికి నిధులు లేవని విభజన హామీలు అమలు చేయడానికి ఎటువంటి ప్రయత్నం చేయలేదని విమర్శించారు అదే విధంగా రెండున్నర లక్షల కోట్ల రూపాయల విశాఖ స్టీల్ ప్లాంట్‌ను అప్పనంగా అమ్మటానికి పూనుకుంటే ఈ రాష్ట్రంలో ఉన్న ప్రధాన రాజకీయ పార్టీలు ఉలుకు పలుకు లేకుండా మోడీకి సాగిలపడి ఉంటున్నాయని ఈ నేపథ్యంలో మోడీ విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేయడానికి ప్రజలందరూ సన్నద్ధం కావాలన్నారు. సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రవిబాబు మాట్లాడుతూ బ్రహ్మయ్య స్ఫూర్తితో పనిచేయటమే నిజమైన నివాళులు అని అన్నారు. కార్యక్రమంలో అమరావతి 1వ శాఖ కార్యదర్శి బి సూరిబాబు, 2వ శాఖ కార్యదర్శి సయ్యద్ మోహిద్దీన్ వలి, చింతల భాస్కరరావు, య. కష్ణ, బాబురావు, గుంటుపల్లి కోటేశ్వరరావు, పాల్గొన్నారు.

రెండేళ్లుగా అదే తీరు...

7 వీక్షణం

గుంటూరు నగరపాలకసంస్థకు 10 ఏళ్ల విరామం తరువాత ఎన్నికలు జరిగి కొత్త కౌన్సిల్ ఏర్పడితే తమ సమస్యలు తీరుతాయని భావించిన ప్రజలకు తీవ్ర నిరాశ ఎదురవుతోంది. 2021లో ఎన్నికలు జరిగి నూతన కౌన్సిల్ ఏర్పడి వచ్చే నెల 18 నాటికి రెండేళ్లుపూర్తవుతుంది. రెండేళ్ల క్రితం వరకు అధికారుల హవా కొనసాగింది. అధికారుల పాలనలో ఇష్టారాజ్యంగా కార్పొరేషన్ ఆదాయానికి గండికొట్టారు. కొంత మంది అధికారులు వారి జేబులు నింపుకొని కార్పొరేషన్ ఖజానాకు చిల్లుపెట్టారు. మేయర్ కావటి మనోహర్ నాయుడు నేతృత్వంలో ఏర్పడిన కౌన్సిల్ కూడా గత రెండేళ్లలో పలు కీలక అంశాల్లో ఆశించిన ప్రగతి సాధించలేకపోయింది. ప్రధానంగా నగరంలో ఆర్‌యూబి, ఆరోబిలకు సంబంధించి ఎటువంటి పురోగతి లేదు. యూజిడి పనులపై ప్రతిష్టంభన కొనసాగుతోంది. సిఎం ఇచ్చిన హామీలను కూడా అమలు చేసుకోవడానికి ఎవ్వరూ చొరవ తీసుకోవడం లేదు. యూజిడి పనులను చేపట్టిన పబ్లిక్ హెల్త్ విభాగం అధికారులతో ప్రత్యేక భేటి ఏర్పాటు చేస్తామని కౌన్సిల్ సమావేశంలో హామీ ఇచ్చి ఏడాది గడిచినా ఇంతవరకు ఒక్క సారి కూడా వారితో సమావేశం నిర్వహించలేక పోయారు. యూజిడి పనులు పూర్తికాకపోవడం, కాంట్రాక్టర్లు రోడ్లు తవ్వివేసి వదిలివేయ డంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పలువురు కార్పొరేటర్లు వాపోతున్నారు. అయినా ఎవ్వరూ స్పందించడం లేదు. నగరంలో కార్పొరేషన్ భూములు, స్థలాలు పెద్ద ఎత్తున కబ్జాకు గురవుతున్నాయి. అయితే వార్డు సచివాలయాలు, అర్బన్ హెల్త్ సెంటర్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాల భవనాలు నిర్మాణం కోసం స్థలాల కొరత ఉందని అధికారులు చెప్పడంపై కార్పొరేటర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. హోర్డింగ్‌ల ద్వారా రావాల్సిన ఆదాయం రాబట్టలేకపోవడంపై టౌన్ ప్లానింగ్ విభాగం ఘోరంగా విఫలం అవుతుంది. రెండేళ్లుగా ప్రతి సమావేశంలో ఈ అంశంపై చర్చిస్తారు. కానీ ఎటువంటి పురోగతి ఉండదు. జియో ట్యాగింగ్ చేస్తామని, అనధికారిక హోర్డింగ్‌లు తొలగిస్తామని ఏడాదిన్నరగా చెబుతున్నారు. ఇంత వరకు అమలు చేయలేక పోయారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో హోర్డింగ్‌ల ద్వారా రూ.9.38 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు కేవలం రూ.1.16 కోట్లు వసూలు చేశారు. హోర్డింగ్‌ల అంశంలో అధికారులు, ప్రజా ప్రతినిధుల అవినీతి వల్ల కార్పొరేషన్ ఆదాయానికి గండి పడుతుందన్న విమర్శలు ప్రభలంగా ఉన్నాయి.

వివిధ విభాగాల్లో అవినీతి, అక్రమాలపై ఉన్నతాధికారులు సీరియస్‌గా పట్టించుకోవడం లేదు. కార్పొరేషన్ నిధులు స్వాహా చేసిన వారిని సస్పెండ్ చేసి చేతులు దులుపు కొంటున్నారని కార్పొరేటర్లు విమర్శిస్తున్నారు. నగర పాలక సంస్థలో 24 గంటలు నీటి సరఫరా చేస్తామని 2013లో రూ.460 కోట్లతో ప్రపంచ బ్యాంకు రుణంతో చేపట్టిన రక్షిత నీటి పథకం పనులు పూర్తయ్యాయని చెబుతున్న అధికారులు ప్రస్తుతం నగరంలో చాలా ప్రాంతాల్లో 20 నిమిషాలు కూడా నీటి సరఫరా జరగడం లేదని విమర్శలు వున్నాయి. విలీనం గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందని కమిషనర్ చేకూరి కీర్తి కౌన్సిల్ సమావేశంలో అంగీకరించడం విశేషం. నగరంలో నిర్మించిన ఏడు వేల టిడ్కో గృహాల అప్పగింత వరకు ఇంత వరకు పూర్తికాలేదు. టిడ్కో గృహాల వద్ద మౌలిక సదుపాయాల కల్పన మందగమనంతో అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

(ఎ.వి.డి.శర్మ)